ఉపాధి కూలీల ఆకలి కేకలు!

- ఆరు వారాలుగా అందని వేతనాలు
- 15 రోజులకే అందించాలన్న నిబంధనకు తూట్లు
- పట్టించుకోని అధికారులు, ప్రత్యామ్నాయ ఉపాధి వైపు కూలీలు


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

పొన్నూరు: వలసల్ని నియంత్రించి.. ప్రజల జీవనోపాధికి గ్రామాల్లోనే 100 రోజుల పని కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేసిన ఉపాధి హామీ పథకం లక్ష్యం నెరవేరడం లేదు. చేసిన పనులకు గాను కూలీలకు సకాలంలో వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. పనులు కల్పించడంలో నిబంధనలు సక్రమంగా అమలు చేసే అధికారులు వేతనాలు అందజేయడంలో పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నిబంధన ప్రకారం చేసిన పనులకు సంబంధించి కూలీలకు 15 రోజులకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. అయితే నెలల తరబడి కూలీలకు వేతనాలు అందడం లేదు. దీంతో కుటుంబాలు గడవడం ఇబ్బందిగా మారిందని కూలీలు వాపోతున్నారు.

ప్రత్యామ్నాయ ఉపాధి వైపు కూలీలు..

పనులు చేస్తున్నా.. వేతనాలు చెల్లించడంలో తీవ్ర జాప్యం ఏర్పడుతుండడంతో ప్రత్యామ్నాయ ఉపాధి వైపు కూలీలు వెళుతున్నారు. చేస్తున్న పనులకు వేతనాలు అందక పనుల్లోకి రాకపోవడంతో


నీటి కుంట పనులు చేస్తున్న కూలీలు

కొన్ని గ్రామాల్లో ఉపాధి పనుల కల్పనలో తాత్సారం జరుగుతోంది. ప్రస్తుతం గ్రామాల్లో ఉపాధి హామీ పనులు అంతంత మాత్రంగా జరుగుతుండగా.. వీటిలో పాల్గొన్న వేతనదారులకు వేతనాలు సకాలంలో అందని దుస్థితి నెలకొంది. మే 10వ తేదీ నుంచి పనులు చేసిన వారికి వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు.

భారీగా బకాయిలు..

ప్రతి కూలీకి పని కల్పించి పనిని బట్టి సగటున రూ.250 నుంచి రూ.300 వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు సిబ్బందికి సూచిస్తున్నారు. క్యాటిల్ షెడ్ల నిర్మాణం, పొలాల్లో నీటి కుంటలు, గృహ నిర్మాణం, ఉపాధి కూలిపనులు వంటి పనులు చేశారు. రోజువారి వేతనం ప్రకారం ఒక్కొక్కరికీ సుమారు రూ.15 వేలకు పైగా బకాయిలు ఉన్నాయి. ఒక ఇంట్లో ఇద్దరేసి వ్యక్తులు పనికి వెళ్తే ఒక్కో కుటుంబానికి రూ.30 వేలకు పైబడి కూలి చెల్లించాల్సి ఉంది. వేతనాలపై సంబంధిత అధికారులు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని కూలీలు వాపోతున్నారు.

పొన్నూరు మండలంలో పథకంలో పనులు చేస్తున్న వారి వివరాలు..

- పని చేసిన గ్రామాలు **24**
- జాబ్ కార్డులు **13,695**
- ఉపాధి హామీ కూలీలు **17,810**
- చేసిన పని దినాలు **1,32,750**
- రావాల్సిన వేతన బకాయిలు సుమారు రూ.**3.81** కోట్లు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం..



ఉపాధి వేతనాలకు సంబంధించి నిధులు విడుదల కావాల్సి ఉంది. సుమారు 6 వారాలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు వచ్చిన వెంటనే జమ చేస్తాం. వేతనదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పూర్తి స్థాయిలో వేతనాలు చెల్లిస్తాం.

– గుమ్మా చంద్రశేఖరరావు, ఎంపీడీఓ, పొన్నూరు

దేవాదాయశాఖ భూమిలో అక్రమ మట్టి తవ్వకాలు



చేబ్రోలు: దేవాదాయశాఖ భూమిలోని నల్ల మట్టిని అధికార పార్టీ నాయకులు యంత్రాల సహాయంతో తవ్వకాలు చేసి విక్రయించిన సంఘటనపై ఆదివారం అధికారులకు ఫిర్యాదులు అందాయి. చేబ్రోలులోని నాగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన వ్యవసాయ భూమి కోవెలమూడి శివారులోని పాతరెడ్డిపాలెం గ్రామ పరిధిలో ఉంది. దేవాదాయశాఖకు చెందిన అధికారులు వ్యవసాయ సాగు కోసం కౌలు వేలం పాటలు నిర్వహించారు. కోవెలమూడికి చెందిన వారు పొలం కౌలుకు తీసుకొన్నారు. కౌలు దారులు గత రెండు రోజులుగా కౌలు భూమిలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తుండటంపై గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కాలువ పూడిక తీత చేస్తున్నట్లు నమ్మించి పొలంలోని మట్టిని కూడా యంత్రాలతో తవ్వి, ట్రాక్టర్ రూ.1000 చొప్పున అమ్మకాలు చేస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై దేవాదాయశాఖాధికారి వినయకృష్ణను ఫోన్‌లో వివరణ కోరటానికి సాక్షి ప్రయత్నించగా అందుబాటులో లేరు.

క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షునిగా ఏసుబాబు



కాకుమాను: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షునిగా కాకుమానుకు చెందిన వినుకొండ ఏసు బాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర కో–కన్వీనర్ ఏటుకూరి విజయ్ కుమార్ మాదిగ తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసూరుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాల మేరకు ఆదివారం ఏసుబాబును నియోజకవర్గ అధ్యక్షునిగా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా ఏసుబాబు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని మాదిగలందరినీ ఏకతాటిపై నడిపించి వారి సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని అన్నారు. అనంతరం జూలై 7వ తేదీన ఒంగోలులో నిర్వహించనున్న మాదిగ మహామేళ పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెద సుబ్బారావు మాదిగ, వందనం మాదిగ, ఇస్రాయేలు మాదిగ, శ్రీను మాదిగ, సురేష్ మాదిగ, పుష్పరాజ్ మాదిగ, హనుమంతరావు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ ప్రవేశ పరీక్షలో పెదకాకాని విద్యార్థి ప్రతిభ



పెదకాకాని: ఎంఎస్ (ఎం ఫార్మసీ) ప్రవేశ పరీక్షలో పెదకాకాని విద్యార్థి ఎం.కిరణ్‌కుమార్ ఆల్ ఇండియాలో 77 ర్యాంక్ సాధించారు. ఎన్ఐపీఈఈఆర్ జేఈఈ–2025 ఎం ఫార్మసీ రెండు సంవత్సరాల కోర్సు ప్రవేశం కోసం కిరణ్‌కుమార్ హాజరయ్యారు. శనివారం వెలువడిన పరీక్షా ఫలితాల్లో విద్యార్థి ఆల్ ఇండియా స్థాయిలో 77వ ర్యాంక్ సాధించారు. అలానే మరో ఎంట్రన్స్ పరీక్ష మాస్టర్స్ (ఎంటెక్) ప్రవేశం కోసం రాసిన పరీక్షలో ఆల్ ఇండియా స్థాయిలో 60వ ర్యాంక్ సాధించారు. చదువులో రాణిస్తూ ఉత్తమ ప్రతిభ చూపుతున్న కిరణ్‌కుమార్‌ను స్థానిక నాయకులు, పలువురు పెద్దలు ఆదివారం అభినందించారు.

జన సమీకరణ చేశారంటూ కేసు నమోదు

గుంటూరు రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు పర్యటన సందర్భంగా గ్రామాల్లో జన సమీకరణ చేయరాదని నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ముందస్తుగా హెచ్చరిక నోటీసులు అందించారు. అయినప్పటికీ వైఎస్సార్‌సీపీ నాయకులు జన సమీకరణ చేశారని కేసు నమోదు చేసిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాలు ఇలా.. జగనన్న పర్యటనకు జనాలను సమీకరించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి అంజిరెడ్డి, నల్లపాడు డివిజన్ కన్వీనర్ దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, చెంచిరెడ్డి, తియ్యగూర శ్రీనివాసరెడ్డి, పార్థురెడ్డిలపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఐదుగురినీ పోలీస్ స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ నిర్వహించి స్టేషన్ బెయిల్‌ను ఇచ్చి పంపారని సమాచారం.

వైభవంగా అంజన్నకు పూజలు



ఫిరంగిపురం: ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామివారి 21వ వార్షికోత్సవం ఈనెల 7న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం పదహారు రోజుల పండుగను విశేషంగా జరిపారు. ఉదయాన్నే స్వామికి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. పొంగళ్లను స్వామివారికి నివేదన చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త పొట్టి వీరేశం గుప్తా, గ్రామపెద్ద కె.పేరారెడ్డిలు పర్యవేక్షించారు.

ఏపీ గురుకులంలో గెస్ట్ ఉపాధ్యాయులకు దరఖాస్తులు ఆహ్వానం

తాడికొండ: తాడికొండలోని ఏపీ గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను గెస్ట్ ఉపాధ్యాయులుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.జోగారావు ఒక ప్రకటనలో తెలిపారు. మాథ్స్‌లో పీజీటీ, హిందీ సబ్జెక్టులో పీజీటీ, టీజీటీలు కావాలని అన్నారు. ఆశక్తి ఉన్నవారు తాడికొండ ఏపీ గురుకులం లేదా 87126 25037 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్

నెహ్రూ నగర్: డయల్ యువర్ కమిషనర్ (0863–2224202) కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ చాంబర్‌లో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

సూపర్ సిక్స్ అమలు చేయాలి

పెదకాకాని: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చే వరకూ సీపీఐ పోరాటం కొనసాగుతుందని పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ అన్నారు. మండలంలోని నంబూరు కార్యాలయంలో ఆదివారం గ్రామసభ నిర్వహించారు. సమావేశానికి కొల్లి రంగారెడ్డి అధ్యక్షత వహించగా సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. మండలంలో ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ నిరుపేదలకు 3 సెంట్ల స్థలం కూడా ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. పంచాయితీ అధికారులు ప్రజల కనీస అవసరాలైన తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, వీధిలైట్ల విషయంలో శ్రద్ధ చూపించాలన్నారు. అనంతరం సభలో గ్రామ సీపీఐ కార్యదర్శిగా కూసం నాగిరెడ్డి, ఉప కార్యదర్శిగా భీమవరపు బ్రహ్మారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం కార్యదర్శి కంజుల విఠల్ రెడ్డి, సీహెచ్ పిచ్చేశ్వరరావు, నాగరాజు, ఆర్దల రామారావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సత్యనారాయణ

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

తాడేపల్లి రూరల్: జూలై 9న నిర్వహించనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐఎఫ్‌టీయూ న్యూ, వైఎస్సార్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. దీని వల్లకార్మికులు సంఘాలను పెట్టుకునే అవకాశం ఉండదని అన్నారు. పని గంటలు పెరుగుతాయని.. కార్మికుల హక్కులను ప్రశ్నించేందుకు అవకాశం ఉందని తెలిపారు. సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసేందుకు మంగళగిరి పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలకు సమ్మె నోటీసులు ఇవ్వాలని సూచించారు. జూలై 7, 8 తేదీలలో మైక్ ప్రచారం నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, సీపీఐ 17వ వార్డు శాఖ కార్యదర్శి గండికోట దుర్గారావు, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, వీవీ జవహర్‌లాల్, సీఐటీయూ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వై.కమలాకర్, ఎం.బాలాజీ, సీఐటీయూ సీనియర్ నాయకులు జేవీ రాఘవులు, సీఐటీయూ నాయకులు శ్రీరాములు, ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు కోటేశ్వరరావు, వైఎస్సార్‌టీయూ నాయకులు ఆర్.శ్రీనివాస్‌రాజు, నక్క నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

రోటరీ క్లబ్ అధ్యక్షులుగా ప్రెగడ రాజశేఖర్


ప్రెగడ రాజశేఖర్

మంగళగిరి, తాడేపల్లి రూరల్: మంగళగిరి రోటరీ క్లబ్ నూతన అధ్యక్షులుగా ప్రెగడ రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి సమావేశాన్ని చినకాకానిలోని ఓ హోటల్‌లో గాజుల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 3125 మాజీ గవర్నర్ అన్నే రత్నప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లో మంగళగిరి రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలతో ముందంజలో ఉందని అన్నారు. అనంతరం 2025–26 నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి నూతన అధ్యక్షులుగా ప్రెగడ రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా అందే మురళి, కార్యదర్శిగా పారేపల్లి నిరంజన్ గుప్తా, సహాయ కార్యదర్శులుగా కాపరౌతు సుందరయ్య, జొన్నాదుల భిక్షారావు, కోశాధికారిగా కేవీఎస్ ప్రకాశరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రావెల శ్రీనివాసరావు, ఇసునూరి అనిల్ చక్రవర్తి, జీఎస్ నాయక్, గోలి శ్రీకాంత్, చనుమోలు గోపాల్, ఉడతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కార్మిక రైతు వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

తాడేపల్లి రూరల్: ప్రధాని మోదీ అవలంభిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అన్నారు. ఆదివారం మంగళగిరి రూరల్ పరిధిలోని నూతక్కిలో సీపీఐ కార్యాలయంలో శాఖ మహా సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో గత 11 ఏళ్లుగా అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. దేశాన్ని కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని తెలిపారు. అనంతరం నూతక్కి గ్రామ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నూతక్కి శ్రీనివాసరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జాన్ ఆబు, సాంబిరెడ్డి, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చిన్ని తిరుపతయ్య

అవోపా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. అవోపా గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం మాట్లాడుతూ అవోపా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న 260 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రముఖ మధుమేహ వైద్య నిపుణుడు రామ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ రామ్‌కుమార్

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించం

మంగళగిరి: రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించమని.. వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ తెలిపారు. ఆదివారం మంగళగిరి రూరల్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, భూదందా, అధిక వడ్డీలు వసూలు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై నిరంతరం నిఘా ఉంచి ఎవరైనా అనుమానాదస్పదంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నగర బహిష్కరణ తప్పదని రూరల్ ఎస్ఐ హెచ్చరించారు.

యువత పోరు నేడు

మంగళగిరి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టిన యువత పోరును విజయవంతం చేయాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో నిరుద్యోగ యువతీ, యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గుంటూరు కలెక్టరేట్ వద్ద యువత పోరుకు హాజరై జయప్రదం చేయాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

సర్వసభ్య సమావేశం నేడు

ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పూషాడపు శివ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. మండలంలోని నిర్వహిస్తున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి సమీక్ష ఉంటుందన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని ఆయన అన్నారు.

కూటమి హామీలను అమలు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల



లక్ష్మీపురం: కూటమి ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శ్రీనగర్ కాలనీలోని మహబూబ్ జెండా చెట్టు 51వ డివిజన్ సీపీఐ శాఖ మహాసభ ఆదివారం నిర్వహించారు. సభ రెహమాన్ అధ్యక్షత వహించారు. నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ డివిజన్ శాఖ కార్యదర్శిగా షేక్ వలితో పాటు తొమ్మిది మందిని ఎన్నుకున్నట్లు చెప్పారు.

హార్మోన్ల సమతల్యతతోనే ఆరోగ్యం


ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న డాక్టర్ ఉమామహేశ్వరరావు

లక్ష్మీపురం: శరీరంలో హార్మోన్ల సమతుల్యతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ప్రముఖ ఎండోక్రనాలజిస్ట్ డాక్టర్ జి.ఉమామహేశ్వరరావు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. సభకు సంస్థ కార్యదర్శి కొండా శివ రామిరెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో చాలామంది శారీరక వ్యాయామం లేక, అధిక మొత్తంలో ఆహారం తీసుకుంటూ, స్వచ్ఛమైన వాతావరణంలో జీవించక అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటూ వారానికి ఐదు రోజులు రోజుకు 45 నిమిషాలు వ్యాయామం చేస్తూ ప్రశాంతంగా ఉంటూ మంచి వాతావరణంలో జీవిస్తూ మంచి ఆలోచనలు చేస్తుందన్నారు.

●రహదారి వెంట పెరిగిన చెట్లు!



పొన్నూరు మండలం మునిపల్లె గ్రామం నుంచి వెల్లలూరు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా పిచ్చి చెట్లు గుబురుగా పెరిగాయి. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డుకి దగ్గరగా ముళ్ల చెట్లు పెరగడంతో రాత్రి వేళ ద్విచక్రవాహన దారులు వాటికి తగిలి గాయాలపాలవుతున్నారు. గత కొన్నేళ్లుగా వీటి బెడద ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు, ప్రయాణికులు వాపోతున్నారు. రాత్రి వేళ పాములు, విష పురుగుల సంచారం కారణంగా బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగించాల్సి వస్తోందని అంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తుప్పలు మరింత పెరిగాయని.. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – పొన్నూరు

హామీలను విస్మరించిన ప్రభుత్వం

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడ గ్రామంలో సీపీఎం నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం దాటిందని, ఇప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని అన్నారు. అన్ని హామీలు అమలు చేశామని రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవాలు జరుపుకొంటోందని విమర్శించారు. నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలంతో పాటు గృహ నిర్మాణ పథకం ద్వారా ఇల్లు నిర్మించి ఇస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కృష్ణానది పక్కనే ఉన్నా తాడేపల్లి ప్రాంతంలో ఇప్పటికీ మంచినీటి సమస్య ప్రధానంగా ఉందని అన్నారు. 200 రోజులుగా ఏసీసీ కార్మికులు నిరాహార దీక్షలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరగ వెంకటేశ్వర్లు, తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ, సీనియర్ నాయకులు వేముల దుర్గారావు, నాయకులు ఎస్‌కే గన్, పల్లె భార్గవ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నేతాజీ

రెండో విడత భూ సమీకరణపై రైతుల్లో గందరగోళం

- సమాయత్త సభల పేరుతో అనుకూల గ్రామాల్లో సభలు
- రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రే తెలిపి ఉదయాన్నే సభల నిర్వహణపై ప్రజల మండిపాటు

తాడికొండ: రెండో విడత భూ సమీకరణ పేరుతో ఆదివారం తాడికొండ మండలంలో నిర్వహించిన గ్రామ సభలు రైతుల్లో గందరగోళాన్ని సృష్టించాయి. సమాయత్త సభల పేరుతో రాత్రికి రాత్రే తేదీ నిర్వహించిన అధికారులు, ఎమ్మెల్యే కనీసం పత్రికల్లో ప్రకటన, ముందస్తు సమాచారం ఇవ్వకుండా సెలవు దినం అని చూడకుండా ఆదివారం హడావుడిగా అనుకూల గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి మమ అనిపించారు. మోతడక, లచ్చన్నగుడిపూడి, ముక్కామల గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి అనుకూల వర్గం తాము సానుకూలమేనంటూ మాట్లాడారు. ముక్కామల గ్రామంలో పలువురు రైతులు మాట్లాడుతూ.. తాము పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి ఉన్నామని, ఇప్పటికిప్పుడు పూలింగ్ అంటే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. రాజధాని పరిధి పెంచి పలు సంస్థలకు కేటాయించేందుకు, అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూ సమీకరణ అవసరమన్నారు. రైతుల అభిప్రాయాలను తెలుసుకుని సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేసేందుకు తనకు 4 నుంచి 5 రోజులు గడువు కావాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ మెహర్ కుమార్, పలువురు టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


ముక్కామలలో సమస్యలపై ఎమ్మెల్యే, ఆర్డీవోలను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు